# దారి

దుప్పల రవికుమార్



దమయంతి ఫెర్రో అల్లాయస్ బోర్డు సాయంకాలపు నీరెండలో తళతళా మెరుస్తోంది. సూర్యుడు ఇంటిదారి పట్టడంతో సింధూర వర్ణం చాలా వరకు ఆకాశాన్ని ఆక్రమించేసింది. ఫ్యాక్టరీ గేట్లు తెరుచుకున్నాయి. అనేక జతల కాళ్ళు వడి వడిగా బయటకు అడుగులు వేస్తున్నాయి.

అన్ని జతల కాళ్ళలో సమూహాలుగా, జతలు జతలుగా కొన్ని కొన్ని దిశలకు పోతున్నాయి. కొన్ని పచారీ షాపులవైపు, కొన్ని మందుల దుకాణాల వైపైతే, మరికొన్ని


"ని సేదవా.... అహహ.... ఎర్రోల్లు.... సారా ని సేదవేట్రా? అయితే నిన్న కాడికి మిగిలిపోయిన సర్కు ఏటి సేశేరు? ఊరోల్లకి పంచరా? లేదు కుంటూ అబ్కారీ గిడ్డంగి వేపు నడిచాడు. దారంతా ఆలోచనలు. కదా! ఉండాలిన కాదుంటాదిలే ....."
అను-తాపత్రయం...సుఖం కోసం.... సారా కోసం.... ఆత్రుత...!

మందు దుకాణం వైపు... ఇట్లా. మందుదుకాణం వైపు సాగిన అనేక జతల కాళ్ళలో ఒక జత చంద్రయ్యవి. నిదానంగా నడుస్తున్నాడు. గాభరాగా ఆలోచిస్తున్నాడు. నుదుటిపై చెమట తుడుచుకున్నాడు. జేబులో డబ్బు తీసి మళ్ళీ లెక్కెట్టాడు.

ఎన్నిసార్లు లెక్కపెట్టినా పదిహేనుం పావలాకు మించట్లేదు. పెళ్ళాం జయమ్మ గుర్తొచ్చింది. దానొళ్ళు కాలిపోతున్న జొరమూ గుర్తొచ్చింది. డాక్టరుబాబు కొనమని చెప్పిన మందులు- మాత్తరలూ గుర్తొచ్చాయి. కొడుకు లోకేశు గుర్తొచ్చాడు. వాడు కట్టాలని చెప్పిన పరీక్ష ఫీజూ గుర్తొచ్చింది. అన్నీ వేటికవి పదిహేనురూపాయలే ఖరీదు చేస్తాయి. ఆ రోజు పడిన కష్టమూ గుర్తొచ్చింది. ఆ కష్టమే ఈ పదిహేన్రూపాయలూ తెచ్చిపెట్టింది.

సారాషాపు ఎదురుపడింది. ఆలోచనలకు కూడా బ్రేకు పడింది. ఐదురూపాయలిచ్చి ఒకే పాకెట్టు తాగాడు. జయమ్మ జొరం మర్చిపోయాడు. తెల్లవారి బూతులు తిట్టిన సూపర్‌వైజరు గుర్తొచ్చాడు. ఆగలేక పోయాడు. మరో పాకెట్టు తాగాడు. సూపర్‌వైజర్‌తో పాటు కొడుకు ఫీజు మాటా మర్చిపోయాడు. ఆ రోజు పడిన కష్టం గుర్తొచ్చింది. చివరి ఐదు నోటిచ్చి మూడో పాకెట్టూ తాగేశాడు. జేబు అడుగునున్న పావలాతో నూనెతో సాతాళించిన ఒక్క






పచ్చిమిరపకాయ కొన్నాడు. కాళ్ళు మెలిక పడుతున్నట్లుగా అయి మళ్ళీ సర్దుకుంటున్నాయి. ఫలితంగా అటూ ఇటూ ఊగుతూ నడుస్తున్నాడు. ఆ ఊగడంతో పాటు ఏదో అనుభవిస్తున్నట్లు, తీపిరుచులు ఆస్వాదిస్తున్నట్లు మైకంగాసగం కళ్ళు మూశాడు. తన్మయంగా పెదవులు చప్పరిస్తున్నాడు.

ఏమీ గుర్తు లేవు. "సుఖం... అంతా సుఖం... శరీరం అంతా... జీవితమంతా... తేలికగా..." మనసులో నవ్వుకుంటున్నాడేమో, నెమ్మదిగా విచ్చుకున్నాయి నల్లగా కమిలిన పెదవులు. ఇల్లు చేరుకున్నాడు.

భార్య జయమ్మ అతనివేపోసారి జాలిగా చూసింది. భయంగా చూసింది... పడ్డించింది. పొరుగింటి నుంచి అప్పుతెచ్చిన పిడికెడు నూకలు కంచం నిండా గంజితో. అదే ఆహారం. అది కూడా సరిగా తినలేదు. ప్లేటు అంతటినీ వేళ్ళతో, కెలికి, కుదిపి, కలిపి లేచి పడుకున్నాడు.

* * *

ధాతువులైన ఫైన్, క్లంప్స్‌ల నుపయోగించి ఈ ఫెర్రో అల్లాయస్ ఫ్యాక్టరీలో కార్బన్ శాతమున్న ఫెర్రోక్రోమును తయారుచేస్తుంటారు. ఈ ఫెర్రోక్రోమును టిస్కోలాంటి స్టీలు సామగ్రి తదితరాలు తయారుచేసే ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు.

బ్రికెట్స్ నుంచి తయారయిన గుడ్‌మెటల్‌ని సైజుని బట్టి చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించే కార్మికులలో చంద్రయ్య ఒకడు. శారీరక శ్రమ ఎక్కువగా ఉన్న దినసరి కూలీ.

మరుసటి దినం కూడా దినసరి వేతనం అందుకుని బయటకు అడుగువేశాడు. అలవాటు ప్రకారంగా సారాషాపు వేపు సాగాడు.

ఆశ్చర్యం! నిత్యం బూతుపదఘోషతో, దుర్భరమైన వాసనతో కళకళమనే 'ప్ర.సా.దు' ఆ రోజు దీనంగా, ప్రశాంతంగా తాళం వేయబడి ఉంది. దగ్గరకెళ్ళి తోటివారి మాటలు విన్నాడు. ఎనిమిది మాసాలుగా చేస్తున్న మహిళల కఠోర సారా నిషేధ ఉద్యమం ఫలించబోతున్నదట... అంచెలవారీ సారా నిషేధం.....

"నిషేదవాం..... అహ్హహ్హా..... ఎర్రోల్లు..... సారా నిసేదవేత్రా? అయితే సిన్నకాడికే మునిగి పోయిన సర్కు ఏటి సేశేదు? ఊరోల్లకి పంచరా? లేదు కదా! ఉండాల్సిన కాడుంటాదిలే....." అనుకుంటూ అబ్కారీ గిడ్డంగి వేపు నడిచాడు. దారంతా ఆలోచనలు. "తాపత్రయం... సుఖంకోసం... సారాకోసం... ఆత్రుత..."

దూరం నించే సారా గిడ్డంగి దగ్గర పోలీసుల కాపాలా చూశాడు. అక్కడి పరిస్థితి అర్థం అవుతున్నకొద్దీ, ఇతడి మానసిక పరిస్థితి విషమిస్తోంది.

"తలపోటు... విపరీతంగా... నాలిక తడారిపోయిందే... అబ్బా నొప్పి... అరే... తల పగిలిపోద్దా... అలవాటయిపోయిందే! ఇప్పుడేదిదారి..." స్థిమితంగా ఆలోచించాడు. అప్పుడు గుర్తొచ్చింది.

...కాపుసారా...

...నాయుడు గారి చౌక సారా...

వేగం వేగం అడుగులేస్తున్నాడు. నాలుగు సందులు తిరిగాడు.

ఒకింటి తలుపు నెమ్మదిగా తట్టాడు. ఇతని పోలికలున్న మరో వ్యక్తి తలుపుతీశాడు. ఇద్దరూ గొణుక్కున్నారు. పది నోటు చేతులు మారింది. లోపలికెళ్ళిన మనిషి మరో పది నిమిషాలకు చేతిలో పొడుగు సీసాతో బయటకు వచ్చాడు. చంద్రయ్య కళ్ళు పెద్దవయ్యాయి. తక్కువ ధరకు సరుకు ఎక్కువ వచ్చిందని కాదు. దొరకదేమో అనుకున్నది దొరికిందుకు. ఆశ్చర్యంతో అంతకు మించి ఆనందంతో.

గుటకేశాడు... గుటకపై గుటకేశాడు. సీసా సగం అయింది. పది రోజులైనా ఇంకా తగ్గని జయమ్మ జ్వరం జ్ఞాపకాలు సారా పొరల్లో క్రమంగా ఇంకిపోతున్నాయి. సీసాలో సారా క్రమంగా తరిగిపోతోంది. ఆఖరి బొట్టు గొంతులో దిగేసరికి సీసా లోపలా శూన్యం. మెదడు లోపలాశూన్యం. ఆలోచనలు పూ...ర్తి...గా... ఇంకిపోయాయి. "సుఖం... అంతా సుఖం... అపూర్వమైన స్థితి..."

"...అబ్బా..." పొట్ట గట్టిగా పట్టుకున్నాడు. కడుపులో నొప్పి. పేగుల్లోంచి ప్రారంభమై గుండెల్లోకి ఎగదన్నుతోంది. నిలవలేకపోతున్నాడు. అడుగు ముందుకు పడడంలేదు. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. ఎదురుగా- మసగ్గా- ఏదో ఇంటి అరుగు- పట్టుకుని కూర్చోబోయాడు. మైకంలో ఒళ్ళు తూలింది. ముందుకు పడిపోయాడు. అరుగు అంచు తలకు కొట్టుకుంది.

దారినపోయే వాడెవడో చంద్రయ్య జేబులో ఐదు చూసి రిక్షా కట్టి, మిగిలిన డబ్బులు తన జేబులో వేసుకుని, ధర్మాసుపత్రిలో చేర్పించాడు.

* * *

'కల్తీ సారా వల్ల కలిగిన అనర్థమిది' పేపరోళ్ళు బాక్సులు కట్టి రాశారు. అస్పత్రిలో పేషెంట్లందరి పరిస్థితీ ఇంచుమించు ఇదే. ఫెర్రో అల్లాయస్ ఫ్యాక్టరీలో అదనపు విభాగాన్ని ప్రారంభించడానికి ఆ ఊరొచ్చిన ముఖ్యమంత్రి పనిలో పనిగా, సపరివారంగా ఆస్పత్రికి వచ్చాడు- ఫోటోగ్రాఫర్లను వెంటేసుకుని మరీ. మంచమ్మీదున్న మొగుళ్ళ తాలూకు పెళ్ళాల ఏడుపులు, గోలలను టీ.వీ. కెమెరా బంధించింది. ఈ బంధనం ప్రతిపక్షాలు వినియోగించుకున్నాయి. కల్తీ సారాతో కొందరు ప్రముఖ నాయకులకు సంబంధం ఉందని ఉద్యమంలో ఉన్న మహిళలు సరికొత్త నినాదాన్ని లేవదీశారు. వారిపై చర్య జరపాలని ఊరేగింపు మొదలుపెట్టారు. పోలీసులు గాలిలో కాల్పులు జరపగానే, అతి మామూలుగా దుండుగులు పోలీసులపై రాళ్ళు రువ్వారు. వీళ్ళకి కోపమొచ్చి కాల్చారు. వాళ్ళు సంతోషంతో దుకాణాలు దోచుకున్నారు. పెద్ద ఎత్తున నష్టం... ఆస్తి నష్టం... ప్రాణ నష్టం...

... ప్రభుత్వం పతనమయింది. మళ్ళీ

ఎన్నికలు పర్వం మొదలయింది. అండర్ గ్రౌండ్‌లో సారా కోసం పంతాలు. (వాళ్ళు చెప్పిందే నాయకులకు వేదం. ఎందుకంటే పోలింగ్ బూతులు చాలా వరకు వాళ్ళ చేతుల్లోనే ఉంటాయి.) ప్రతిపక్షం ఓట్ల కోసం ఒకటే సందడి. హాస్పిటల్స్ అన్నీ తిరిగేరు. పెద్ద పెద్ద ఆసుపత్రుల్లో ఉన్న రోగులందరికీ పళ్ళూ, పాలూ పంచిపెట్టారు. ఎన్నికల సంరభం రాజుకుంది.

మామూలుగానే, ఆల్టర్‌నేటివ్‌గా ప్రతిపక్షానికి ఎక్కువ సీట్లు దక్కాయి. ప్రతిపక్షం అధికారం చేజిక్కించుకుంది.

సారా నిషేధం కొనసాగించాలా? వద్దా? లేదంటే సమస్యకు మూలకారణమైన కల్తీసారాను ఎదుర్కోవాలా? రాజకీయ నాయకులు, ఉద్దండులు అధికార, అనధికార సమావేశాలు ఏర్పరిచారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. చర్చలు తీవ్రస్థాయిలో రాజుకున్నాయి. పరిస్థితి ఉద్రిక్తమయింది. సాధారణమైన నిరుద్యోగసమస్యతో పాటుగా, నిత్యావసరమైన మంచినీటి సమస్యతో సహా అన్నీ మర్చిపోయి, క్రొత్త ప్రభుత్వం తీర్పు కోసం రాష్ట్ర ప్రజ యావత్తూ ఎదురు చూస్తోంది. సమావేశ నిర్ణయం జరిగింది. ఫలితం వెలువడింది.

గతంలో జరిగిన పొరపాటు సారా వల్ల కాదు. కల్తీ సారా వల్ల. (ఛంద్రయ్యలాంటి) సారాజు లెందరో సారా నిషేధించడం వల్ల, కల్తీ సారా త్రాగి అనారోగ్యం పాలయ్యారు. కాబట్టి, కల్తీ సారా లేకుండా చేస్తామని, పూర్తి కట్టుదిట్టంగా మట్టు బెడతామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సారాను మాత్రం ప్రభుత్వమే సరఫరా చేస్తుంది- మరింత అందమైన ప్యాకేజీతో; ఆర్డినెన్సు వెలువడింది.

దురదృష్టవశాత్తూ, మన కథానాయకుడు చంద్రయ్యకివేవీ తెలియరాలేదు.

* * *


చంద్రయ్య నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. పక్షం రోజులు కోమానుంచి అప్పుడే బయట పడ్డాడు. ఎదురుగా భార్య జయమ్మ. వెక్కి వెక్కి ఏడుస్తూ పరిస్థితి అంతా చెప్తోంది. ఇంతలో డాక్టరొచ్చాడు. అరగంట లేటుగా హాస్పిటల్‌లో అడ్మిట్ చేస్తే పరిస్థితి చేయి దాటిపోయి ఉండేదని చెప్తున్న డాక్టరు గారి వేపు మాన్పడి చూస్తుండిపోయాడు. చెదలు పట్టినట్లున్న అతని లివరున్న ఎక్స్-రే వేపూ, ఇంకెప్పుడూ సారా జోలికి పోకూడదని, పోవద్దని చెబుతున్న డాక్టరు వేపూ మార్చి మార్చి చూస్తున్నాడు చంద్రయ్య. నెమ్మదిగా పూర్వ పరాలు అన్నీ స్మృతి పథంలోకి తెచ్చుకున్నాడు. చంద్రయ్య ఆరోగ్య పరిస్థితి మరో వారం రోజులకి అదుపులోకి వచ్చింది. మామూలు మనిషయ్యాడు.

రాష్ట్ర పరిస్థితి కూడా చక్కదిద్దుకుంది.

* * *

ఉదయాన్నే తలారా స్నానం చేసి, యథాప్రకారంగా బయల్దేరాడు చంద్రయ్య- పెంచి పోషిస్తున్న ఫ్యాక్టరీకి. వాతావరణం అంతా క్రొత్తగా, వింతగా కనిపిస్తోంది చంద్రయ్యకు. సాయంత్రమయింది. జీతం (కాకపోతే కూలీసొమ్ము) లెక్కచూసుకుంటూ నెమ్మదిగా బయటకు వస్తున్నాడు.

సారా షాపు వేపు తిరిగిన కాళ్ళను ఠక్కున ఆపాడు. ప.సా.దు. వేపు చూశాడు. ఆనందంతో కాదు. ఆర్తితో, అపురూపంగా కానేకాదు. నిర్లిప్తంగా చూశాడు. నిరాసక్తంగా చూశాడు. నిస్పృహతో గాఢంగా నిట్టూర్చాడు. నెమ్మదిగా వెనక్కి తిరిగి ఇంటివేపు దారి తీశాడు. పది హేన్రూపాయలూ భార్య జయమ్మ చేతిలో పెట్టాడు. ఆమె కంటి నుండి ఉబికివస్తున్న నీటిని- అవి ఖచ్చితంగా ఆనందబాష్పాలే- చూస్తూ నవ్వాడు. నెమ్మదిగా విచ్చుకున్నాయి గులాబీ రంగుకు మారబోతున్న పెదవులు. ●



# చూపు

డా. ఆర్వీయస్. సుందరం.



కాన్ని కళ్ళను చూస్తే కవిత్వం పుట్టుకొస్తుంది
మనిషి భాషకు కన్ను నిఘంటువు
కంటి నిఘంటువులో చూపుల అర్థాలను అన్వేషించేవాడే
విజ్ఞాని.
మూసి పెట్టిన నిఘంటువులో శబ్దాలుంటాయి,
అర్థాలుండవు.
అర్థాన్ని వింపుకున్న చూపు కవిత్వానికి స్ఫూర్తి.
ఒక్కొక్క చూపు జీవితాన్నే మార్చేస్తుంది.
జీవనయాత్రలో
మాచీస్తంభంగా నిలిచిపోతుంది.
కొన్ని కళ్ళకు చూపే ఉండదు
జీవ ధాతువుల్ని స్పందింపజేసే
చేవ ఉండదు
ఒక చిత్రకారుని కుంచెలోంచి
జీవ వర్ణాలు పరుచుకోవాలంటే
కళ్ళు కావాలి
ఒక గొంతులోంచి మాధుర్యం
అలలు అలలై గుండె లోతుల్లోకి ప్రవహించాలంటే
కళ్ళు కావాలి
కవిత్వం వెలుగులో స్నానం చేసి
రసస్పందనకు ఆస్పదం కావాలంటే
కళ్ళు కావాలి
చూపులతో భావ జ్వాలల నుద్దీపించే
కళ్ళు కావాలి. ●